## క్లుప్తంగా

### 15న మండల స్థాయి అధికారులతో సమావేశం

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ పండగ వచ్చే నెల 3 వ తేదీన జరగనున్న సందర్భంగా పండగ ఏర్పాట్లకు సంబంధించి మండల స్థాయి అధికారులతో 15 వ తేదీన మోదకొండమ్మ ఆలయం వద్ద సమావేశం జరగనుందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఆలయ కమిటీతో పాటు అధికారులతో చర్చించి ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. సమావేశానికి మండల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

### బదిలీ అయిన పోలీసు సిబ్బందికి సన్మానం



ఎ.కోడూరు పోలీసుస్టేషన్‌లో సిబ్బందికి సన్మానం చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

కె. కోటపాడు : చిత్తశుద్ధితో పనిచేసే ప్రతి ఉద్యోగికి గుర్తింపు ఉంటుందని ఎ. కోడూరు ఎస్‌ఐ డి. లక్ష్మీనారాయణ అన్నారు. ఎ. కోడూరు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీపై వేర్వేరు పోలీసు స్టేషన్లకు వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లకు శుక్రవారం మధ్యాహ్నం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుళ్లు కుమార్, ఈశ్వరావు, సత్యనారాయణతో పాటు కానిస్టేబుళ్లు రామలక్ష్మి, శ్రీను, శ్రీనివాస్‌లను సత్కరించి జ్ఞాపికలు అందించారు.

### కుంజర్తి, పెడుంపాలెంలో ఉచిత వైద్య శిబిరాలు



మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

రావికమతం : కొత్తకోట ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చీమలపాడు పంచాయతీ కుంజర్తి,పెడుంపాలెం గిరిజన గ్రామాల్లో డాక్టర్ మోహిని సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 43 మంది రోగులకు తనిఖీలు చేశారు. ఇద్దరికి జ్వర తీవ్రత ఉండడంతో వారికి ఆర్డీడీ టెస్టు ద్వారా రక్త పరీక్షలు నిర్వహించగా నెగిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వైద్యులు తెలిపారు. వైద్య పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, వైద్య సిబ్బంది రమణ, ఉషారాణి పాల్గొన్నారు.

### నేరాలు నిరోధించడానికి డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాతో పరిసరాలు చిత్రీకరిస్తున్న ఎస్‌ఐ రఘువర్మ

రావికమతం: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేరాలు నిరోధించడానికి సాంకేతిక వాడకాన్ని ఉపాయోగించి నిఘా వ్యవస్థ మరింత బలోపేతం చేయనున్నట్టు రావికమతం ఎస్‌ఐ రఘువర్మ తెలిపారు. మండల కేంద్రంలో, చిన పాచిలి, కవ్వగుంట, కోట్నాబిల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం డ్రోన్ కెమెరాను ఉపయోగించి చుట్టూ పరిసరాలను పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలలో ముగ్గురు మద్యం సేవిస్తున్న వారిని ఈ డ్రోన్ సహాయంతో గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఈ డ్రోన్ కెమెరా ద్వారా కిలోమీటర్ దూరంలో మందు తాగినా, గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, జూదం ఆడినా వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### వడ్డాది వైద్యాధికారిగా రమ్య



బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిగా టి.రమ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న మౌనిక విశాఖ బదిలీపై వెళ్లారు. పెందుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న రమ్యను వడ్డాదికి బదిలీ చేశారు. దీంతో ఆమె శుక్రవారం విధుల్లో చేరగా తోటి సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

### 12న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మాకవరపాలెం : ఈ నెల 12న మండల కేంద్రంలోని కొత్తవీధిలో గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద వార్షిక కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు ఆదినారాయణ, శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఆలయం నిర్మించి సోమవారం రాటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ద్వితీయ వార్షికోత్సవాలు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 12తేదీ ఉదయం 9 గంటల నుంచి కల్యాణం ప్రారంభం అవుతుందని, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

# పెద్దేరుపై చిన్నచూపు?



పెద్దేరు జలాశయం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రావిపాలెం వద్ద పెద్దేరు ప్రధాన పంట కాలువకు తుప్పలు తొలగించిన దృశ్యం

- నిలిచిపోయిన ఆధునికీకరణ పనులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.84.40 కోట్లు నిధులు
- కూటమి ప్రభుత్వం రాగానే రబీకి నీటి నిలుపుదల
- పంట చెరువులు, వ్యవసాయ మోటార్లతో అక్కడక్కడా రబీ సాగు
- మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- 19,969 ఎకరాలకు సాగునీటి సమస్య

మాడుగుల: మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు ద్వారా రెండు నియోజకవర్గాలకు పూర్తి స్థాయిలో సాగు నీరందించేందుకు 30 ఏళ్ల క్రితం రూ.38 కోట్లతో జాలంపల్లి పంచాయతీ రావిపాలెం వద్ద జలాశయం నిర్మాణం చేపట్టారు. పంట కాలువలు పూర్తి కాకపోవడంతో శివారు ఆయకట్టు వరకు సాగు నీరందరక రైతులు ప్రతి ఏటా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జలాశయం ఆధునికీకరణ పనులు చేపట్టడానికి అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ 84.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. అప్పట్లోనే ప్రధాన పంట కాలువ జలాశయం నుంచి కింతలి వరకు పంట కాలువకు తుప్పలు తొలగించారు. అయితే ఈ లోగా ఎన్నికలు రాగానే ఆ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పనులు చేపడతామని, గత రబీ పంటకు సాగునీరు విడుదల కూడా చేయలేదు. పంట కాలువలకు సీసీ లైనింగ్ అవుతుందని, రెండు పంటలకు కూడా ఢోకా లేదని, రైతులు ధీమా పడ్డారు. కానీ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కూడా రావడంతో ఆధునికీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సీసీ లైనింగ్ నిర్మాణం జరుగుతుందా లేదా అని రైతులు మీమాంసలో ఉన్నారు. చోడవరం నియోజకవర్గంలో రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల నియోజకవర్గంలో మాడుగుల మండలాలకు ఈ జలాశయమే ఆధారం. రెండు నియోజకవర్గాల్లో 90 శాతం మంది రైతులకు వ్యవసాయమే జీవనాధారంగా జీవనం సాగిస్తున్నారు.

#### పనులు నిలిచిపోవడం బాధాకరం



ప్రతి నీటిబొట్టు రైతులకు అందజేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బూడి ముత్యాలనాయుడు పెద్దేరు ఆధునికీకరణకు రూ. 84.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. పనులు కూడా ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆధునికీకరణ ఊసేలేదు. రెండు నియోజకవర్గాలకు ఆధారమైన పెద్దేరు ఆధునికీకరణ పనులు సత్వరం చేపట్టాలి.

–బొడ్డపు భాస్కరరావు, రైతు, వొమ్మలి గ్రామం

#### ఆధునికీకరణ పూర్తి చేయాలి



19 వేలు ఆయకట్టు ఉన్న జలాశయం పంట కాలువలకు ఆధునికీకరణ చేపట్టాలి. ఇక్కడ రైతులందరూ వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. ఎటువంటి కంపెనీలు లేవు. ప్రభుత్వం స్పందించి గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో మళ్లీ సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలి. పూర్తిగా సాగునీరందించి రైతులను ఆదుకోవాలి.

– గోకేడ అప్పలనాయుడు, రైతు సత్యవరం

## రూ.10 లక్షల జెడ్పీ నిధులతో సీసీ డ్రైనేజీల నిర్మాణం



డెనేజీ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

దేవరాపల్లి : మామిడిపల్లిలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు కేటాయించినట్టు జెడ్పీటీసీ కర్రి సత్యం తెలిపారు. మామిడిపల్లిలో రూ.10 లక్షలతో చేపట్టే డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడుతో కలిసి ఆయన శ్రీకారం చుట్టారు. పొక్లెయిన్‌తో డ్రైనేజీలు తవ్వకం పనులను ప్రారంభించారు. కొట్టాన నాగులు ఇంటి నుంచి శారదానది వరకు, పరదేశమ్మ ఆలయం నుంచి శ్మశానం వరకు సీసీ డ్రైనేజీలను నిర్మించనున్నట్టు జెడ్పీటీసీ సత్యం, సర్పంచ్ సూరినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, సర్పంచ్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, వార్డు మెంబర్ నెక్కెళ్ల నాయుడు, నాళం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థికసాయం



మణికంఠ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం : కన్నంపేట గ్రామానికి చెందిన సియాద్రి మణికంఠ కొత్తకోట హైస్కూల్ లో పదో తరగతి చదువుకున్నాడు. ఇటీవలే విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. పేద కుటుంబంలో పుట్టి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడంతో తల్లిదండ్రులు నాని, అమ్మాజీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఆనందం ఎంతో కాలం మిగలలేదు. ఇటీవలే ప్లేట్‌లెట్స్ తగ్గి హార్ట్ బీట్ తగ్గడం, ఊపిరితిత్తులు సమస్యతో విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది కలిసి వైద్య ఖర్చులు నిమిత్తం రూ.23 వేలు వారి పెద్దమ్మ వేణి కి శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వాసవీలత, కన్నయ్యదొర పాల్గొన్నారు.

## నాగయ్యపేటలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



నాగయ్యపేటలో చీపురు చేత పట్టి చెత్త ఊడ్చుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి అన్నారు. మండలంలోని నాగయ్యపేటలో ఎంపీడీవో సువర్ణరాజుతో కలిసి శుక్రవారం పర్యటించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంపద కేంద్రం చుట్టూ ఉన్న తుప్పలతో పాటు సచివాలయం వెనుక భాగంలో చెత్తను మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు పారిశుధ్య సిబ్బందితో దగ్గరుండి తొలగింప చేశారు. చెత్త సంపద తయారీ కేంద్రం నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి, వారి సమస్యలను ఎంపీడీవో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్.ప్రభాకర్, ఇంచార్జ్ హౌసింగ్ ఏఈ ఎస్. భవ్యతేజ, మామిడిపపల్లి పశువైద్యాధికారి జి.ప్రియాంక, ఇంచార్జ్ ఈవోపీఆర్డి అనంత ఉమాదేవి, మండల స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ త్రినాథ్, స్థానిక పంచాయతీ సెక్రటరీ జీవన్‌బాబు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు



చిరు ధాన్యాలు ప్రదర్శన

నాతవరం : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖాధికారి శైలజ అన్నారు. మండలంలో పాయకరావుపేట వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో నాతవరం మండలం పీకేగూడెం, ఎస్‌బీపట్నం గ్రామాల్లో శుక్రవారం సర్పంచ్ ఎల్.జోగినాయుడు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం, చిరు ధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందడమే కాకుండా చిరుధాన్యాలు సాగుతో అనేక ఉపయోగాలు పొందవచ్చున్నారు. సేంద్రియ విధానంలో భూమి సారవంతంగా ఉంటుందన్నారు తెగుళ్లు రాకుండా నీరు నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి పండించిన ఉత్పత్తులను ప్రదర్శించారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు

నర్సీపట్నం : కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ మంత్రిత్వశాఖ సహాయంతో ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం పంట మార్పిడిపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.తేజేశ్వరరావు మాట్లాడుతూ విలువ ఆధారిత సమగ్ర వ్యవసాయ విధానాల గురించి రైతులకు వివరించారు. పంట మార్పిడితో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుందన్నారు. వాతావరణ మార్పులు వ్యవసాయంలో పాటించవలసిన అంశాల గురించి ప్రధాన శాస్త్రవేత్త డా.బి.సహదేవరెడ్డి వివరించారు. ఆరుతడి పంట లైన జొన్న, కూరగాయల పంటలు, పండ్ల తోటలతో సమగ్ర వ్యవసాయం పాటించాలని సూచించారు.

మాకవరపాలెం: పంటమార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తేజేశ్వరరావు, సహదేవరెడ్డి రైతులకు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు పంటలమార్పిడిపై శుక్రవారం శిక్షణ ఏర్పాటు చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం, పశువులు, గొర్రెలు, కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులకు అందిస్తున్న రాయితీలను ఏవో చిరంజీవి తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి పాల్గొన్నారు.

## ఎ.కోడూరులో మోదకొండమ్మ పాదాల ప్రతిష్ట



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కె.కోటపాడు : ఎ.కోడూరులో మోదకొండమ్మ అమ్మవారి పాదాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పాదాల నిర్మాణం,మండపాన్ని గ్రామానికి చెందిన బొడ్డు సన్యాసినాయుడు, లక్ష్మి దంపతులు సొంత ఖర్చుతో జరిపారు. అర్చకులు జి.భాస్కరశర్మ శాస్త్రోక్తంగా హోమాది కార్యక్రమాల అనంతరం పాదాలను ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి పాదాల వద్ద పూజలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

## చైన్ స్నాచర్ల కోసం గాలింపు



బుచ్చెయ్యపేటలో వేలి ముద్రలు సేకరిస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల పలు గ్రామాల్లో బుచ్చెయ్యపేట పోలీసులు శుక్రవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. మూడు రోజుల కిందట మండల కేంద్రం బుచ్చెయ్యపేట చెరకు కాటా వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు స్కూటీపై వచ్చి మహిళ మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పట్టుకుపోయారు. దీంతో ఎస్‌ఐ శ్రీనివాసరావు బుచ్చెయ్యపేట, రాజాం, సీతయ్యపేట, వడ్డాది, బంగారు మెట్ట జంక్షన్‌లో వెహికల్ చెకింగ్ చేసి పలువురు అనుమానితుల నుంచి వేలిముద్రలు సేకరించారు. ఇప్పటికే నిందితులను సీసీ ఫుటేజీల ద్వారా ఫొటోలు సేకరించి వారిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

## 'నాపై భూ ఆరోపణలు అవాస్తవం'

కె.కోటపాడు : తనపై కింతాడ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కావాలనే తప్పుడు భూ ఆరోపణలను చేస్తున్నారని కింతాడ మాజీ సర్పంచ్ బండారు అరుణకుమారి భర్త నరసింహనాయుడు అన్నారు. కింతాడలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇటువంటి తప్పుడు భూ ఆరోపణలను చేస్తున్నట్టు నరసింహనాయుడు తెలిపారు. ఇటువంటి తప్పుడు ఆరోపణలు ఇకపై చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయనతో పాటు విలేకరుల సమావేశంలో బొట్ట కోనారి, సూర్రెడ్డి మల్లునాయుడు, శివస్వామినాయుడు పాల్గొన్నారు.

## మైనారిటీలు, క్రిస్టియన్లకు రుణాలు

మాడుగుల రూరల్ : మండలంలో మైనార్టీలు, క్రిస్టియన్ మైనార్టీలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి పథకంలో రుణాలు మంజూరుకు ఈ నెల 25 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె. అప్పారావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు, క్రిష్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీల కోసం స్వయం ఉపాధి పథకం కింద లక్ష రుపాయల నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు 50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఎ.పి.ఒ.బి.ఎం.ఎం.ఎస్. వెబ్‌సైట్‌లో ఈ నెల 25 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### సాక్షిపై పోలీసుల తీరు

# ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- మండిపడ్డ దేవరాపల్లి మండల పాత్రికేయులు
- తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతి పత్రం



దేవరాపల్లిలో తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

దేవరాపల్లి : ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, సెర్చ్ వారెంట్ లేకుండా సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి నివాసంలో పోలీసులు దౌర్జన్యంగా చొరబడి సోదాలు నిర్వహించడాన్ని దేవరాపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి అంటూ నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై కథనాలు రాస్తున్నందుకు కక్ష సాధింపుతో సాక్షి ఎడిటర్ ఇంట్లో నిర్బంధ సోదాలు నిర్వహించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల గొంతుకై ప్రశ్నించే వారి పట్ల దాడులు సరికాదని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. దాడులతో పత్రికా రంగానికి సంకెళ్లు వేయలేరని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజె జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామరాజు, పి.గణేష్, పి.నానాజీ, పి.నాగభూషణం, రొప్పలరాజు, గెడ్డం నగేష్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు నేత

చీడికాడ : కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు నిరసనగా సీఐటీయు ఆధ్వర్యంలో ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు కోరారు. చీడికాడలో శుక్రవారం సిఐటీయు మండల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగించే లేబర్‌కోడ్స్ తెచ్చిందన్నారు. ఈ లేబర్‌కోడ్స్ రద్దు, కనీస వేతనాలు అమలు తదితర కార్మికులకు నష్టం కలిగించే చర్యలకు వ్యతిరేకంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎం.జానకీ, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం, ఆశా కార్యకర్తల యూనియన్, ఐకేపీ యానిమేటర్లు యూనియన్ నేతలు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవర్లపై కేసులు



తాండవ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ

నాతవరం : నిబంధనలు ఉల్లంఘించి డ్రైవింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ అన్నారు. మండలంలో తాండవ జంక్షన్‌లో గల శ్రీ సిద్ధి వినాయక ఆటో యూనియన్ డ్రైవర్లతో శుక్రవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా ఆటోలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకుని వేగంతో వాహనం నడిపినా, రికార్డులు లేకపోయినా, వాహనాల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఆటోపై వాహనదారులు ఫోన్, ఆటో నంబరు ప్రయాణికులకు కన్పించేలా ఏర్పాటు చేయాలన్నారు. మహిళా ప్రయాణికుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో నాతవరం ఎస్‌ఐ భీమరాజు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామివారి తిరువీధోత్సవం

చోడవరం : స్థానిక శ్రీ ఆపదహర శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు కన్నులపండువగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 13వ తేదీన స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలు ప్రారంభంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను తిరువీధుల్లో ఊరేగించారు. ఈ తిరువీధోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళల కోలాటం , వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వింజుమూరి శంకర్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



పోస్టరు విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, నాయకులు

నాతవరం : ఈ నెల 20వ తేదీన తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అన్నారు. మండలంలో సరుగుడు గ్రామంలో శుక్రవారం ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఆర్ఏలతో కలిసి సమ్మె పోస్టరు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటంతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కుదించేందుకు కుట్ర చేస్తుందన్నారు. కొత్త కార్మిక చట్టాలు అమల్లోకి వస్తే కార్మికుల హక్కులు ప్రైవేటు కాంట్రాక్టర్ల ఆధీనంలోకి పోతాయని, తక్కువ జీతాలతో వెట్టి చాకిరి చేయాల్సి వస్తుందని, ఉద్యోగ భద్రత ఉండదని హెచ్చరించారు.

## సామరస్యంగా భూ సమస్యల పరిష్కారం

నాతవరం : వారసత్వంగా వచ్చిన భూములను కుటుంబ సభ్యులు ఐక్యంగా పంచుకుంటే ఎలాంటి సమస్య రాదని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం ఏర్పాటు చేసి ఇరువురికి కౌన్సెలింగ్ చేశారు. మన్యపురట్లలో 45 ఎకరాల భూమి ఒకే కుటుంబానికి చెందిన వారు చాలా కాలంగా వివాదం పడుతున్నారు. ఏళ్ల తరబడి నడుస్తున్న భూవివాదంపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తాండవ రిజర్వాయరు నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన వారందరికి అప్పట్లో ప్రభుత్వం గాంధీనగరం గ్రామంలో 200 ఎకరాలు డీ ఫారం పట్టా భూములు ప్రభుత్వం ఇచ్చింది. ప్రస్తుతం భూములకు ఊహించని విధంగా రేట్లు పెరగడంతో కుటుంబ సభ్యులు మధ్య తగాదాలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు గ్రామాల్లో కుటుంబాల మధ్య వివాదం జరుగుతున్న భూమి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల ప్రకారం రికార్డుల ప్రకారం నిబంధనలు అనుసరించి పరిష్కారం చేస్తామన్నారు.

## రోడ్డు సమస్యలపై నిలదీసిన మండల సభ్యులు

చోడవరం : పలు సమస్యలపై సభ్యులు మండల సమావేశంలో ఏకరువు పెట్టారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గాడి కాసు అధ్యక్షతన చోడవరం మండల సమావేశం శుక్రవారం జరిగింది. కొన్ని శాఖల అధికారుల నిర్లక్ష్యం, పనితీరు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని మండల సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆంజనేయులు మండల పరిషత్ నివేదికను చదివి వినిపించిన అనంతరం ఒక్కో శాఖ పనితీరు నివేదిక ఉంచారు. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖల పనితీరుపై పలువురు సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేశారు. వీధి కుక్కలు ఎక్కువైపోవడంతో అనేక మంది గాయాలపాలయ్యారని, వాటిని నిర్మూలించాలని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా నేటికీ మెయిన్‌రోడ్డు పనులు చేపట్ట లేదని, పెద్ద పెద్ద గోతులు పడడంతో రోడ్డు అంతా ప్రమాదకరంగా ఉందని ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. గ్రామాల్లో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, కాల్వలు నిర్మిస్తామని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చెప్పారు. ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆయన ఆదేశించారు.

## ఓటరు జాబితాపై ఆర్డీవో సమీక్ష



నాయకులతో సమావేశమైన ఆర్డీవో రమణ

నర్సీపట్నం : ఓటరు జాబితాపై వివిధ పార్టీల రాజకీయ నాయకులతో ఆర్డీవో వి.వి.రమణ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఓటరు జాబితాపై ఆయా రాజకీయా పార్టీల నాయకులు అభిప్రాయాలను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన గ్రామమైన లింగాపురం గ్రామస్తులు ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న కృష్ణాపురం 138 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, 240 ఓట్లు ఉన్నందున లింగాపురం గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల నాయకులు కోరారు. మున్సిపాలిటీ బీసీ, కలాసీ బూత్‌లో 1300లకు పైగా ఓట్లు ఉన్నందు ప్రస్తుత బూత్‌లో ఓటర్లను తగ్గించి, కొత్త మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని రాజకీయ నాయకులు కోరారు. ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డీటీ సుధారాణి, వైసీపీ ఏకా శివ, కాంగ్రెస్ సుబ్బన్న, బీఎస్పీ నాగరాజు, బీజేపీ జగన్నాథ్ పాల్గొన్నారు.